డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
PRGI NO: TGTEL/26/A0383
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
తెలంగాణ మంగళవారం 29-09-2026 సంపుటి: 01 సంచిక : 261 పేజీలు : 12

## ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం మాములుగా ఉండదు: దానం నాగేందర్

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో నిర్ణయాత్మక ఫలితం వస్తుందని దానం జోస్యం.
- ఈసీని వాడుకుని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శ.
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్.
- ఉపఎన్నికలో పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన దానం.



2

## తెలంగాణపై కమలం ఫుల్ ఫోకస్.

ఐదుగురితో కొత్త కమాండ్.
బన్సల్‌కు తెలంగాణ ఇన్‌చార్జ్ బాధ్యతలు కొనసాగింపు.
అభయ్ పాటిల్, రేఖా శర్మలకు సహ ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు.
సంస్థాగత వ్యవహారాలకు మధుకర్, దాశరథికి కీలక బాధ్యతలు.
హైదరాబాద్, వరంగల్ కేంద్రాలుగా పార్టీ వ్యవహారాల పర్యవేక్షణ.




2

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 28:**

తెలంగాణలో పార్టీ సంస్థాగత వ్యవహారాలను మరింత పటిష్టం చేసేందుకు భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర రాజకీయ, సంస్థాగత వ్యవహారాలను వేర్వేరుగా పర్యవేక్షించేలా ఐదుగురు నేతలతో కొత్త కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటించిన తాజా సంస్థాగత మార్పుల్లో తెలంగాణకు ప్రాధాన్యం లభించింది.

## పాడిపై వేటు తప్పదా?



2

- ఎథిక్స్ కమిటీ నిర్ణయంపై ఉత్కంఠ.
- హుజూరాబాద్‌కు ఉప ఎన్నికపై రాజకీయ వర్గాల్లో చర్చ.
- చర్యలు కక్ష పూరిత మంటున్న బీఆర్ఎస్..సభా గౌరవాన్ని కాపాడేందు కేనంటున్న కాంగ్రెస్.

## ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

టీజీపీఎస్సీ పలు ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల.
అక్టోబర్, నవంబర్ నెలల్లో పరీక్షల నిర్వహణ.
అసిస్టెంట్ సైంటిస్ట్, ఏఈఈ, డీఈవో పోస్టులకు తేదీల ఖరారు.




2



## తెలంగాణలో 41 కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్.

తెలంగాణలో కొత్త బార్ అండ్ రెస్టారెంట్లకు నోటిఫికేషన్ జారీ.
దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజుగా నిర్ణయం.
అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ, 16న లాటరీ ద్వారా కేటాయింపు.

## వైఎస్సార్ తరహాలో.. రేవంత్ వ్యూహం!

ఖైరతాబాద్ ఉపఎన్నికపై సీఎం ప్రత్యేక దృష్టి.
దానం నాగేందర్ చుట్టూ ఆసక్తికర రాజకీయ సమీకరణాలు.
కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరుకు రంగం సిద్ధం.



2

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 28:**

తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక హై-వోల్టేజ్ పోరుగా మారుతోంది. సాధారణ ఉపఎన్నికగానే కాకుండా.. అధికార కాంగ్రెస్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ప్రతిష్టాత్మకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు స్పష్టత

నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన.
స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం.
రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం.

2





## తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు.

తెలంగాణపై ఎల్ నినో ప్రభావం.
సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు.
నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత.
రానున్న రెండు రోజుల్లో మరింత పెరగనున్న ఎండలు.

2



## ఫేస్‌బుక్‌లో మహిళతో పరిచయం.

రూ.14.61 కోట్లు పోగొట్టుకున్న హైదరాబాద్ డాక్టర్!
హైదరాబాద్ వైద్యుడిని మోసం చేసిన ఫేస్‌బుక్ స్నేహితురాలు.
నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పేరుతో భారీ మోసం.
విత్‌డ్రాకు ప్రయత్నించగా ట్యాక్స్ పేరుతో మరో రూ.7.5 కోట్లు డిమాండ్.
తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దర్యాప్తు, 40 ఖాతాలకు డబ్బు మళ్లింపు.

2

డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
PRGI NO: TGTEL/26/A0383

# తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు.

**జనం వాయిస్, సెప్టెంబర్ 27:**

తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది. ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# ఫేస్‌బుక్‌లో మహిళతో పరిచయం.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 27:**

ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెట్టిన ఓ దంత వైద్యుడు ఏకంగా రూ.14.61 కోట్లు పోగొట్టుకున్నారు. తెలంగాణలో ఇప్పటివరకు ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని జరిగిన అతిపెద్ద సైబర్ మోసాల్లో ఒకటిగా ఈ ఘటన నిలిచింది. బాధితుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)ని ఆశ్రయించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన 44 ఏళ్ల దంత వైద్యుడికి ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్‌లో 'మోనికా మాధవ్' అనే పేరుతో ఒక మహిళ పరిచయమైంది. తాను చెన్నైకి చెందిన దానినని, విడాకుల ప్రక్రియలో ఉన్నానంటూ సానుభూతి పొందింది. ఆ తర్వాత తనను టెలిగ్రామ్‌లో సంప్రదించాలని కోరి, తాను ట్రేడింగ్ ద్వారా రోజూ రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నట్లు నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వైద్యుడితో ఎంఎ-ఝుతీఎవ్ంశ్రీస.ఝీఎ అనే నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లో ఖాతా తెరిపించి, ఆధార్ వివరాలు అప్‌లోడ్ చేయించింది. నమ్మకం కుదిర్చేందుకు, సెప్టెంబర్ 3న వైద్యుడు పెట్టిన రూ.30 లక్షల పెట్టుబడికి రూ.8.6 లక్షలు లాభం వచ్చినట్లు సైట్‌లో చూపించారు. అందులో నుంచి రూ.85,000 విత్‌డ్రా చేసుకునేందుకు కూడా అనుమతించడంతో అతనికి అనుమానం రాలేదు. ఇదే అదనుగా, ఇద్దరం కలిసి రూ.10 కోట్లు పెట్టుబడి పెడదామని ఆమె ప్రతిపాదించింది. దీంతో వైద్యుడు తన వద్ద ఉన్న డబ్బుతో పాటు, అప్పులు చేసి విడతల వారీగా మొత్తం రూ.14.51 కోట్లు డిపాజిట్ చేశాడు. ఆయన ఖాతాలో మొత్తం లాభం రూ.34 కోట్లు ఉన్నట్లు సైట్‌లో కనిపించింది. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, ఆప్షన్ పనిచేయలేదు. డబ్బు రావాలంటే పన్నుల కింద రూ.7.5 కోట్లు చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు డిమాండ్ చేశారు. అదే సమయంలో మోనికా తన కాంటాక్ట్‌లను బ్లాక్ చేసి అదృశ్యమవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై ఐటీ చట్టంలోని సెక్షన్ 66-డీతో పాటు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితుడు 91 సార్లు డబ్బు బదిలీ చేసినట్లు, ఆ మొత్తం 10 రాష్ట్రాల్లోని 40 బ్యాంకు ఖాతాలకు మళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. టీజీసీఎస్‌బీ అధికారులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం మాములుగా ఉండదు:

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 27:**



ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలో వచ్చే తీర్పు నిర్ణయాత్మకంగా ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దానం నాగేందర్, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ 'ఓట్ల దొంగతనం' చేస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఇదే జరిగిందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఖైరతాబాద్ సీటు ఫలితాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దానం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ ఉపఎన్నికలో పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు.

# తెలంగాణలో 41 కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 27:**

తెలంగాణలో కొత్తగా 41 బార్ అండ్ రెస్టారెంట్ల (2బీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరితో కూడిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలో 14, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27 బార్లకు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఒక్కో దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నేటి నుంచి అక్టోబర్ 12 వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబర్ 16న ఉదయం 11 గంటలకు లాటరీ పద్ధతిలో విజేతలను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు లైసెన్స్ తీసుకోకపోతే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ప్రాంతాన్ని బట్టి వార్షిక బార్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను (బీఈటీ) నిర్ణయించారు. టీసీయూఆర్ పరిధిలోని బార్లకు రూ.44 లక్షలు, బోధన్ వంటి కొన్ని ప్రాంతాలకు రూ.42 లక్షలు, మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.30 లక్షలుగా రుసుము ఖరారు చేశారు. ఈ 41 కొత్త బార్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.14.62 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా దేవరకద్ర, ఎల్లంపల్లి, మద్దూరు, గుమ్మడిదల వంటి ప్రాంతాల్లో తొలిసారిగా బార్లు ఏర్పాటవుతున్నాయి. వీటితో పాటు చేవెళ్ల, మొయినాబాద్, కొడంగల్, పరిగి, అశ్వారావుపేట, కల్లూరు, మక్తల్, నర్సంపేట, స్టేషన్ ఘన్‌పూర్, ములుగు వంటి పలు మున్సిపాలిటీల్లోనూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా సుమారు 1,185 బార్లు ఉండగా, ఒక్క హైదరాబాద్‌లోనే 657 బార్లు ఉన్నాయి.

# తెలంగాణపై కమలం ఫుల్ ఫోకస్.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 28:**

తెలంగాణలో పార్టీ సంస్థాగత వ్యవహారాలను మరింత పటిష్ఠం చేసేందుకు భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర రాజకీయ, సంస్థాగత వ్యవహారాలను వేర్వేరుగా పర్యవేక్షించేలా ఐదుగురు నేతలతో కొత్త కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటించిన తాజా సంస్థాగత మార్పుల్లో తెలంగాణకు ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా సునీల్ బన్సల్‌ను కొనసాగిస్తూ, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్ పాటిల్, మాజీ జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మలను సహ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. దీంతో తెలంగాణలో పార్టీ రాజకీయ వ్యవహారాలను ముగ్గురు నేతలు సమన్వయంతో పర్యవేక్షించనున్నారు. సునీల్ బన్సల్‌కు పశ్చిమ బెంగాల్ బాధ్యతలు కూడా కొనసాగాయి.

## సంస్థాగత విభాగానికి కొత్త నాయకత్వం

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షించేందుకు మధుకర్‌ను రాష్ట్ర ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీగా నియమించారు. ఖమ్మం ప్రాంతానికి చెందిన మధుకర్ ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన నేతగా, మధ్యప్రదేశ్ బీజేపీలో సంస్థాగత బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉన్న వ్యక్తిగా పార్టీ వర్గాల్లో గుర్తింపు పొందారు. హైదరాబాద్ కేంద్రంగా ఆయన తన బాధ్యతలను నిర్వర్తించనున్నారు. అదేవిధంగా దాశరథిని తెలంగాణ రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీగా నియమించారు. ఆయన వరంగల్ కేంద్రంగా సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. దీంతో రాష్ట్రంలోని క్షేత్రస్థాయి పార్టీ నిర్మాణం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఏర్పడింది.

## క్షేత్రస్థాయిపై ప్రత్యేక దృష్టి

తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ పోరాటాల నేపథ్యంలో పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని బలోపేతం చేయడమే తాజా పునర్వ్యవస్థీకరణ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. రాజకీయ వ్యవహారాలను ఒక వైపు, సంస్థాగత నిర్మాణాన్ని మరో వైపు విభజించి బాధ్యతలు అప్పగించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సమన్వయాన్ని పెంచే ప్రయత్నం జరుగుతోంది. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కొత్త వ్యవస్థ ఎంతవరకు ఉపయోగపడుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది. రాష్ట్ర నాయకత్వం, జాతీయ నాయకత్వం నుంచి నియమితులైన ఇన్‌చార్జ్‌లు, సంస్థాగత నేతల మధ్య సమన్వయం తెలంగాణ బీజేపీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణలో కీలకంగా మారనుంది.

# పాడిపై వేటు తప్పదా?

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**



బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై వచ్చిన ఫిర్యాదును శాసనసభ ఎథిక్స్ కమిటీ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కమిటీ తీసుకోబోయే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కడియం శ్రీహరి సభలో మాట్లాడుతున్న సమయంలో కౌశిక్‌రెడ్డి అభ్యంతరకరంగా ప్రవర్తించారని, అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. అలాగే తనవైపు తుపాకీతో కాల్చే విధంగా సైగలు చేశారని కడియం శ్రీహరి ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీని కూడా ఎథిక్స్ కమిటీ పరిశీలించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ అంశాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేయడంతో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 29న జరిగిన సమావేశంలో కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై కమిటీ చర్చించి, సంబంధిత వాదనలు పరిశీలించింది. అనంతరం కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేసి వివరణ కోరింది. తనపై వచ్చిన ఆరోపణలపై పూర్తి వివరణ ఇచ్చేందుకు ఆరు వారాల సమయం కావాలని కౌశిక్‌రెడ్డి ఎథిక్స్ కమిటీని కోరారు. సెప్టెంబర్ 16న ఆయన వ్యవహారంపై నివేదిక సమర్పించేందుకు ఎథిక్స్ కమిటీకి మరింత గడువు పొడిగిస్తూ శాసనసభ నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా.. కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ అధికార కాంగ్రెస్ వర్గాల నుంచి వినిపిస్తుండగా, ఈ వ్యవహారం రాజకీయ కక్షసాధింపు చర్యగా బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు సభా గౌరవం, నిబంధనలను ఉల్లంఘించిన వ్యవహారాలపై చర్యలు తీసుకోవాల్సిందేనని అధికార పక్షం వాదిస్తోంది. కమిటీ తుది నివేదికలో ఎలాంటి సిఫారసులు చేస్తుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది. అయితే కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు లేదా రాజీనామా తప్పదన్న ప్రచారం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఉన్న అంచనాలే తప్ప, తుది నిర్ణయంగా చెప్పలేం. ఎథిక్స్ కమిటీ నివేదిక, స్పీకర్ తదుపరి చర్యలపైనే దీనిపై స్పష్టత రానుంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పదవిపై ఏదైనా తుది నిర్ణయం వెలువడితే ఉప ఎన్నిక అంశం కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉండటంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం అందరి దృష్టి ఎథిక్స్ కమిటీ తదుపరి నిర్ణయంపైనే ఉంది.

# ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 28:**

తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# వైఎస్సార్ తరహాలో.. రేవంత్ వ్యూహం!

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 27:**

తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక హై-వోల్టేజ్ పోరుగా మారుతోంది. సాధారణ ఉపఎన్నికగానే కాకుండా.. అధికార కాంగ్రెస్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ప్రతిష్ఠాత్మకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## వైఎస్సార్ నాటి పరిణామాల ప్రస్తావన

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దానం నాగేందర్ టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫ్‌నగర్ ఉపఎన్నికలో పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికలో ఆయన ఓటమి పాలయ్యారు. అప్పటి పరిణామాలను ప్రస్తుత ఖైరతాబాద్ రాజకీయ పరిస్థితులతో పోల్చుతూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## దానం చుట్టూ రాజకీయ ఉత్కంఠ

ప్రస్తుతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ నుంచి ఆయన అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ, పార్టీ తరఫున ఆయనే బరిలో నిలిచే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

## త్రిముఖ పోరుకు రంగం

ఖైరతాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు ప్రధాన పార్టీలు ఈ ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజల రాజకీయ వైఖరిని అంచనా వేసేందుకు ఈ ఎన్నిక కీలకంగా మారనుంది.

## రేవంత్ వ్యూహాలకు పరీక్ష

అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ తమ బలాన్ని చాటుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. దీంతో ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల



ఎంపిక, స్థానిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తుతో పాటు కాంగ్రెస్ పార్టీపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షిస్తారా? పార్టీ అభ్యర్థి విజయానికి ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తారు? అనే అంశాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు స్పష్టత

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 27:**

తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది. ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన.**

**స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం.**

**రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం.**



జనంవాయిస్ తెలుగు దినపత్రిక

# పారుపల్లికి ఆర్టీసీ బస్సు సేవలు

- సర్పంచ్ చొప్పరి సంపత్ కృషితో నెరవేరిన మారుమూల గ్రామస్థుల కల.
- బస్సు గ్రామంలోకి రావడంతో హర్షం వ్యక్తం చేసిన ప్రజలు.



**జనం వాయిస్, ముత్తారం, సెప్టెంబర్ 28:**

ముత్తారం మండలంలో మారుమూల గ్రామమైన పారుపల్లికి ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులోకి రావడంతో గ్రామస్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గ్రామ ప్రజల రవాణా ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ చొప్పరి సంపత్ ప్రత్యేక చొరవ తీసుకుని బస్సు సౌకర్యం కల్పించేందుకు చేసిన కృషి ఫలించింది. గ్రామం నుంచి పెద్దపల్లి, గోదావరిఖని తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు చాలాకాలంగా రవాణా సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ చొప్పరి సంపత్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) గోదావరిఖని డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించడంతో పాటు పలుమార్లు స్వయంగా కలిసి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన గోదావరిఖని డిపో మేనేజర్.. జమ్మికుంట నుంచి గోదావరిఖని వెళ్లే బస్సును పారుపల్లి గ్రామం లోపలికి నడిపించేలా చర్యలు చేపట్టారు. తొలిసారిగా బస్సు గ్రామంలోకి చేరుకోవడంతో మహిళలు, యువత, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

### త్వరలో పెద్దపల్లి బస్సు కూడా

పారుపల్లి గ్రామం నుంచి పెద్దపల్లి వైపు కూడా బస్సు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలు ఈ రవాణా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామానికి బస్సు సేవలు తీసుకురావడంలో చొరవ చూపిన సర్పంచ్ చొప్పరి సంపత్‌కు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సానుకూలంగా స్పందించి బస్సును గ్రామంలోకి నడిపించిన గోదావరిఖని డిపో మేనేజర్‌కు కూడా సర్పంచ్, గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ అంబటి చంద్రమౌళి, గ్రామ యూత్ అధ్యక్షుడు కారుపకాల శ్రీకాంత్, వీఆర్ తెలుగు టీవీ రాజశేఖర్, బైరాం రాజు, మాజీ వైస్ ఎంపీపీ తిరుమలరావు, పీక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు తప్పని తిప్పలు!

- మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై రోగుల ఆవేదన.
- డాక్టర్లు సరిగా పరీక్షించడం లేదని ఆరోపణలు..
- ల్యాబ్ రిపోర్టుల కోసం గంటల తరబడి నిరీక్షణ.
- రోగులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని ఇద్దరు మహిళా వైద్యులపై ఆరోపణలు.
- జిల్లా ఉన్నతాధికారులు ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్.
- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్.

**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 28:**

మంథని నియోజకవర్గ ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ఆరోపించారు. ఉచిత వైద్యం అందాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను వైద్యులు పూర్తిస్థాయిలో పరీక్షించడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. స్టెతస్కోప్‌తో పరీక్షించాల్సిన సందర్భాల్లో కూడా కొంతమంది వైద్యులు దూరం నుంచే రోగి సమస్యను అడిగి, ఓపీ చీటీలో మందులు రాసి పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని



అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో వచ్చిన వారు వైద్యుల నుంచి తగిన పరీక్షలు, స్పందన కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

### రోగులతో దురుసు వైఖరిపై ఆరోపణలు

జ్వరం తదితర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఇద్దరు మహిళా వైద్యులు దురుసుగా మాట్లాడుతున్నారని కొందరు రోగులు ఆరోపిస్తున్నారని సురేష్ తెలిపారు. ప్రభుత్వ జీతం తీసుకుంటున్న వైద్య సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రోగుల పట్ల సానుకూలంగా స్పందించి, వారి సమస్యలను ఓపికగా వినాలని కోరారు.

### ల్యాబ్ రిపోర్టుల కోసం గంటల తరబడి నిరీక్షణ

ఆసుపత్రి ల్యాబ్‌లో పరీక్షల కోసం వచ్చే రోగులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆరోపించారు. గతంలో డబ్బులు చెల్లించి పరీక్షలు చేయించుకునే సమయంలో పెద్ద సంఖ్యలో రోగులకు పరీక్షలు నిర్వహించేవారని, ప్రస్తుతం ఉచితంగా పరీక్షలు అందుతున్నప్పటికీ రిపోర్టుల కోసం గంటల తరబడి వేచి



చూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. రిపోర్టుల ఆలస్యంపై అడిగిన రోగులకు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత ఆలస్యం అవుతుందని సిబ్బంది చెప్పడం సమంజసం కాదన్నారు.

### ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ?

మంథనిలో కొత్త ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చే వరకు ప్రస్తుత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌పైనే ప్రజలు ఆధారపడాల్సి ఉందని సురేష్ అన్నారు. అందువల్ల ఆసుపత్రిలో వైద్యులు, ల్యాబ్ సిబ్బంది పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించడంతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కూడా ఆకస్మికంగా తనిఖీ చేస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయని అన్నారు. వైద్యుల పనితీరు, రోగులతో వ్యవహరించే విధానం, ల్యాబ్ సేవలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సామాన్యులకు మెరుగైన వైద్యం, గౌరవప్రదమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం.
- పుష్కర ఘాట్ల అభివృద్ధి, గౌతమేశ్వర ఆలయ పనులు త్వరగా ప్రారంభించాలి.
- భూసేకరణను వేగవంతం చేసి రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలి.
- భక్తులకు మౌలిక వసతులు, రహదారులు, పార్కింగ్‌పై ముందస్తు ప్రణాళిక.



**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 28:**

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథని ప్రాంతంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం మంథనిలో పర్యటించిన ఆయన పుష్కర ఘాట్ల అభివృద్ధి, గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణం, పుష్కరాల అవసరాల కోసం చేపట్టాల్సిన భూసేకరణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత అధికారులు, రైతులతో భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పుష్కరాల అవసరాలకు సంబంధించిన ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ విషయంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్న కలెక్టర్.. నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటూనే, పనులకు అవసరమైన భూమిని సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

### ఘాట్ల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలి

గోదావరి పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను వెంటనే



ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పుష్కరాల సమయంలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, పార్కింగ్, భద్రత తదితర సౌకర్యాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

### గౌతమేశ్వర ఆలయ పనులపై ప్రత్యేక దృష్టి

మంథనిలోని గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎండోమెంట్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇదిలా ఉండగా, మల్లెపల్లి బాలుర డిగ్రీ కళాశాలను స్థానిక బాలుర పాఠశాల ఆవరణలోకి మార్చిన నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులను కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిఫోద్దిన్, సంబంధిత శాఖల అధికారులు, ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంజని పుట్టినరోజు సందర్భంగా సిమెంట్ బల్లల పంపిణీ.

- ప్రజల సౌకర్యార్థం మూడు ప్రాంతాల్లో సిమెంట్ బల్లల ఏర్పాటు.

**జనం వాయిస్, నేలకొండపల్లి, సెప్టెంబర్ 28:**

సేవా కార్యక్రమాల్లో భాగంగా కొదుమూరి కవితా బోదులరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొదుమూరి అంజని పుట్టినరోజు సందర్భంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో మూడు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లల్లో ఒకదాన్ని స్థానిక పోస్టాఫీసు వద్ద, మరొకదాన్ని పెట్రోల్ బంక్ వెనుక




ప్రాంగణంలో, ఇంకొకదాన్ని స్త్రీ శక్తి ఉపాధి హామీ భవనం వద్ద ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు వచ్చే ప్రజలకు కూర్చునేందుకు సౌకర్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ బల్లలను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కొదుమూరి కవితా బోదులరావు ఫౌండేషన్ గతంలో పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ కొదుమూరి దిలీప్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 28:**



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రామగుండం కేసీఆర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు ఎం.డి. అహ్మదొద్దిన్ ఉద్యోగం కల్పించాలని కోరగా, వారధి సొసైటీకి రాస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లికి చెందిన అజిమా బేగం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, పీడీ హౌసింగ్‌కు పంపించారు. సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లికి చెందిన దాసరి రాజారెడ్డి సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిన భూమికి పట్టా చేయాలని కోరగా, రెవెన్యూ అధికారికి చర్యల కోసం పంపించారు. పాలకుర్తికి చెందిన మాదాసు అమృత కార్యాలయానికి వినియోగించిన షెడ్డుకు సంబంధించిన అద్దె, విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరగా, తహసీల్దార్‌కు తగిన చర్యల కోసం సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం.

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వై. పవిత్ర.

**జనం వాయిస్, పెద్దపల్లి, సెప్టెంబర్ 28:**

పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం కింద వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వై. పవిత్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ల్యాబ్ టెక్నీషియన్ 8, స్టాఫ్ నర్స్ 15, ఎంఎల్‌హెచ్‌పీ 8, ఎస్టీఎల్ఎస్ 2, ఏఎన్ఎం 3, ఫార్మసిస్ట్ 1, పాథాలజిస్ట్ 1, ఓబీజీ స్పెషలిస్ట్ 2 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 40 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హతలు, పోస్టుల వివరాలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి సమాచారాన్ని పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్ షష్ష.జూవసఋఖజ్ఞుశ్రీశ్రీఱ.వశ్రీఖఅస్త్రుఋఖ.స్త్రశీజ.ఱఅలో పరిశీలించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# 'ఖని' మెజీషియన్లకు అరుదైన గౌరవం

- ఖమ్మంలో జరిగిన 'మాయాబజార్-2' మేజిక్ కన్వెన్షన్ లో రాజాకు గజమాలతో సత్కారం.
- హరికి సిల్వర్ మెడల్ బహూకరణ.

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 28:**



ఖమ్మం జిల్లా కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏపి మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 42వ ఇంద్రజాలికుల సదస్సు 'మాయాబజార్-2' లో స్థానిక ప్రముఖ ఇంద్రజాలికులు మేజిక్ రాజాను అతిథులు, కార్యక్రమ నిర్వాహకులు గజమాలతో సత్కరించగా.. మేజిక్ హరికి సిల్వర్ మెడల్ అందజేసి అభినందించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన మేజిక్ రాజా, తన కంచుకంఠంతో, చెణుకులు-ఛలోక్తులతో కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తి కట్టించి ఆహూతులను మంత్రముగ్ధులను చేయగా.. కార్యక్రమానికి హాజరైన అతిథులు, నిర్వాహకులు రాజాను గజమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అలాగే సూపర్ సీనియర్ మెజీషియన్స్ కాంపిటీషన్ లో పాల్గొన్న హరి తన అద్భుతమైన ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను మెప్పించగా, ఆయనను సిల్వర్ మెడల్ తో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్, ఏపిఎంఏ అధ్యక్షులు జేవీఆర్, సెక్రటరీ, సదస్సు కన్వీనర్ కేవివివి కుమార్, డా.ఆర్యల్, మేజిక్ స్టార్ బోస్, యూపీ రాయుడు, జేమ్స్, బాబు నాయుడు, గౌస్ తదితరులు పాల్గొన్నారు. కాగా రాజా, హరి అరుదైన సత్కారాన్ని అందుకోవడంపట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, యతిరాజ్ కాస, సభ్యులు, స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.




# ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు దర్యాపూర్ టీజీఎంఎస్ విద్యార్థులు.

## కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖోలో ప్రతిభ.. వాలీబాల్‌లో ద్వితీయ స్థానం.

**జనం వాయిస్, ముత్తారం, సెప్టెంబర్ 28:**

పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) పూర్వ కరీంనగర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ముత్తారం మండలం దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్--14 కబడ్డీ విభాగంలో ఎం. శ్రీశాంత్, కె. శక్షిత్, అండర్--14 వాలీబాల్ విభాగంలో ఎం. రాజ్‌కుమార్, ఈ. గౌతమ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్--17 కబడ్డీ విభాగంలో బి. మణికంఠ, ఖో-ఖో విభాగంలో సిద్ధు పూర్వ కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్--14 వాలీబాల్ జట్టు జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థులు క్రీడల్లో చూపిన ప్రతిభ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ శ్రీ హరిప్రసాద్, టీజీఎంఎస్ దరిపూర్ ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. జిల్లా స్థాయిలో మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.



# నియంత పాలనకు ప్రజలే చరమగీతం పాడుతరు

## యువకుల పాదయాత్ర అభినందనీయం: జక్కు శ్రీహర్షిణీ రాకేష్, రఘువీర్ సింగ్.

**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 28:**

రాష్ట్రంలో కొనసాగుతున్న నియంత పాలనకు ప్రజలే చరమగీతం పాడుతారని భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ అన్నారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా, పుట్ట మధుకర్‌ను మంథని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ యువకులు మంథని నుంచి ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వరకు చేపట్టిన పాదయాత్రను పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్‌తో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజల్లో, యువతలో చైతన్యం తీసుకువచ్చేందుకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలు మేల్కొని ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.



# లక్కీ డ్రాతో పేదల సొంతింటి కలకు కొత్త ఆశలు

**జనం వాయిస్, మంచిర్యాల, సెప్టెంబర్ 28:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదీఖానా మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండు పడకల ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా లక్కీ డ్రా నిర్వహించారు. కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హాజరయ్యారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, న్యాయబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన కుటుంబాలకు సొంతింటి ఆనందం దక్కాలని ఆకాంక్షించారు. రెండు పడకల ఇళ్ల పథకం ద్వారా పేద, అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్షకు తావులేకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. లక్కీ డ్రా సందర్భంగా తమ పేరు వస్తుందన్న ఆశతో లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురుచూశారు. ఎంపికైన కుటుంబాల్లో సొంతింటి కల నెరవేరుతుందన్న ఆనందం వ్యక్తమైంది. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మంచిర్యాల ఎంఆర్ఓ రఫతుల్లా, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




# బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా రాజ్యాధికారం సాధించాలి

## రాజకీయ కుట్రలను తిప్పికొట్టి రాజ్యాంగ ఫలాలు అందరికీ దక్కేలా పోరాడాలి : విశారదన్ మహారాజ్.

**మహబూబాబాద్, సెప్టెంబరు 28 (జనం వాయిస్):**

బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉద్యమించి రాజ్యాధికారం చేపట్టడమే బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ప్రధాన లక్ష్యమని విశారదన్ మహారాజ్ అన్నారు. సోమవారం వరంగల్ హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న రాజకీయ కుట్రలను ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు, ఫలాలు ఆయా వర్గాలకు పూర్తిస్థాయిలో అందేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమ హక్కుల కోసం ఐక్యంగా నిలబడితే రాజ్యాధికారం సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మన తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పేరం వీరస్వామిని ఆహ్వానించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్యతో పాటు పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.




# చిన్నారి మృతికి మాజీ మంత్రి రెడ్యానాయక్ పరామర్శ

**కురవి, సెప్టెంబరు 28 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన జర్నలిస్ట్ గండమాల రోషయ్య కుమార్తె అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యానాయక్ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బజ్జురి పిచ్చిరెడ్డి, బిఆరెస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవి నాయక్, కురవి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, రాగం వీరభద్రం,తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బేతమళ్ల సహదేవ్, బీఆర్ఎస్ నాయకులు ఇరుగు వెంకన్న, దుడ్డేల వినోద్, సర్పంచ్ లు మాలోత్ రమేష్, బాదావత్ వీరన్న, బానోత్ మల్చుర్, ఆయూబ్ పాషా, గొల్లమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల హక్కుల కోసం పోరాటమే లక్ష్యం

## బీజేపీ లేబర్ సెల్‌లో జిల్లా, మండలాల నూతన కమిటీల నియామకం.

**జనం వాయిస్, గోదావరిఖని, సెప్టెంబర్ 28:**

కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని బీజేపీ లేబర్ సెల్ నూతనంగా నియమితులైన నాయకులు పేర్కొన్నారు. బీజేపీ లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి సూచనల మేరకు పెద్దపల్లి జిల్లా లేబర్ సెల్‌లో నూతన నియామకాలు చేపట్టారు. రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరుకాగా, బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో-కన్వీనర్‌తో పాటు వివిధ మండలాల కన్వీనర్లను నియమించి వారికి నియామక పత్రాలను అందజేశారు. బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కో-కన్వీనర్‌గా ఎల్తురి రాజయ్య నియమితులయ్యారు. అలాగే జనగామ మండల్ కన్వీనర్‌గా బియ్యాల మహేందర్, లక్ష్మీనగర్ మండల్ కన్వీనర్‌గా వీరబోయిన శ్రీనివాస్ యాదవ్, తిలక్‌నగర్



మండల్ కన్వీనర్‌గా జక్కుల ప్రవీణ్, కో-కన్వీనర్‌గా సుమలత, ఎన్‌టీపీసీ మండల్ కన్వీనర్‌గా ఎరుకొండ తిరుపతి, 8వ కాలనీ మండల్ కన్వీనర్‌గా కంచర్ల రాజేశం, పాలకుర్తి మండల్ కన్వీనర్‌గా బైరి తిరుపతి గౌడ్, అంతర్గాం మండల్ కన్వీనర్‌గా గోలివాడ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలను గుర్తించి, వారి హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కార్మికులకు అందుబాటులో ఉండేలా లేబర్ సెల్‌ను మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

# జాషువా స్ఫూర్తితో సామాజిక పోరాటాలను విస్తృతం చేయాలి

- ఆర్ఎస్ఎస్, బీజేపీ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి.
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 28 (జనం వాయిస్):**

గుర్రం జాషువా స్ఫూర్తితో కులవివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాంస్కృతిక, సామాజిక పోరాటాలను విస్తృతంగా చేపట్టాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పేరుమాండ్ల జగన్నాథం భవన్‌లో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశ్వమానవ మహాకవి గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రామ్మూర్తి మాట్లాడుతూ.. సనాతన ధర్మం పేరుతో శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక అణచివేత,




ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా జాషువా తన కవితా రచనల ద్వారా గొంతెత్తారని అన్నారు. కులవివక్ష, అగ్రవర్ణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆయన రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా మనువాద భావజాలాన్ని ప్రజలపై రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక, సామాజిక శక్తులు ఐక్యంగా సాంస్కృతిక పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మందుల మహేందర్, గద్దపాటి సంతోష్, అల్వాల ఆనంద్, మచ్చ వెంకన్న, దుడ్డేల బ్రహ్మం, షేక్ ఖాదర్ బాబా, అచ్చ నాగేష్, కిన్నెర నాగరాజు, కిన్నెర శ్రీకాంత్, బేతమల్ల సందీప్, వంకాయల గోపీచంద్, ఆరెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- ప్రతీ ఒక్క ఉద్యోగి ఆన్లైన్లో ముఖ చిత్రం హాజరులో నమోదు చేయాలి.
- కలెక్టర్ స్నేహ శబరిష్.



**మహబూబాబాద్, సెప్టెంబర్ 28 (జనం వాయిస్):**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రతీ ఒక్కరూ ఆన్లైన్ ముఖ చిత్రం హాజరులో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో, మహబూబాబాద్ ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ రెవిన్యూ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల (ఇంచార్జ్) పురుషోత్తం లతో కలిసి,వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారం పై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరిస్తూ వారు చెప్పిన వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. గురుకుల హాస్టల్స్, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కావలసిన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల స్పెషల్ అధికారులు సత్వరమే అందజేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులైన ఓటర్లు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ( 93 ) అర్జీలను ప్రజలు అందజేయగా మహబూబాబాద్ , ఆర్డీవో కార్యాలయాల్లో ( 03 ), ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు ( 123 ) వచ్చాయి. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (225) మొత్తం అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో కార్యక్రమంలో డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డివిఎచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రవి రాథోడ్, సిపిఓ శ్రీనివాసరావు, డిహెచ్ఎస్ఓ జీ. మరియన్న, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో సీఈసీ జ్ఞానేశ కుమార్ దిష్టిబొమ్మ దహనం

- సర్ పై కాంగ్రెస్ నిరసన.. రాజీనామా చేయాలని డిమాండ్.
- డీసీసీ అధ్యక్షురాలు ఉమామురళి నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ.. కలెక్టర్‌కు వినతిపత్రం.

**మహబూబాబాద్, సెప్టెంబరు 28 (జనం వాయిస్):**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) అంశంపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా సోమవారం మహబూబాబాద్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్యా ఉమామురళి నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట



ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఇసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా



కేంద్రాల్లో సెప్టెంబరు 28న నిరసనలు నిర్వహించాలని టీపీసీసీ పిలుపునిచ్చిన నేపథ్యంలో మహబూబాబాద్ లోనూ ఈ కార్యక్రమం జరిగింది. నిరసన అనంతరం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్ ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా పారదర్శకత పాటించాలని, ఎన్నికల జాబితా సవరణపై సమగ్ర వివరణ ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

- సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.డి. అబ్దుల్ రషీద్.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 28 (జనం వాయిస్):**

భగత్ సింగ్ ఆశయాలను సాధించేందుకు యువత ముందుకు రావాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.డి. అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు. మరిపెడ బంగ్లా మున్సిపాలిటీ పరిధిలోని కార్గిల్ సెంటర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన మహోన్నత విప్లవ వీరుడు భగత్ సింగ్ అని అన్నారు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి యువతకు




స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భగత్ సింగ్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా సమసమాజ స్థాపనను ఆకాంక్షించిన గొప్ప విప్లవకారుడని అన్నారు. సమాజంలోని అసమానతలు, దోపిడీ, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్య, లౌకిక, సమానత్వ విలువలను కాపాడుతూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ వెంకన్న, పి. వీరన్న, పి. కృష్ణ, సిహెచ్. రాజు, కే. వెంకన్న, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## కురవి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ : జిల్లా ఎస్పీ డా. శబరీష్.

**కురవి, సెప్టెంబర్ 28 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలోని కురవి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది యూనిఫాంను పరిశీలించారు,పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీసులపై విశ్వాసం పెంపొందించేలా విధులు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ వాటిని పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని సూచించారు. స్టేషన్‌లోని లాకప్, ఈ- కోప్స్, రైటర్స్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించిన ఎస్పీ, సీసీటీఎన్స్ , ఈ-సుమ్మోన్స్, ఈ- సాక్ష్యం, ఆన్‌లైన్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్స్, టీజీ -కాప్ తదితర పోలీసింగ్ వ్యవస్థల అమలుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, గంజాయి నేరస్థులు, బూజర్స్, సీసీటీవీ సర్వైలెన్స్ తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను



గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

### మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత

మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పాటు, వారి భద్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్, గుడుంబా, గంజాయిపై ప్రత్యేక నిఘా

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. గుడుంబా తయారీ,



విక్రయాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలిపారు. గంజాయి వినియోగం, విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

అత్యవసర పరిస్థితుల్లో బ్లూ కోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సమయం, కోర్టు విధుల్లో ఉన్న సిబ్బంది, పెండింగ్ కేసుల వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల్లో చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ రూరల్ సిఐ అంజలి, ఎస్సై సతీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సగర్వంగా... సాగనంపేలా..!

- వైకుంఠధామానికి ఉచితంగా బోరుబావి ఏర్పాటు
- గ్రామ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి : సర్పంచ్ రెంటాల కృష్ణ, మాజీ జడ్పీటీసీ అంబటి వీరభద్రం గౌడ్, ఉపసర్పంచ్ కృష్ణమూర్తి.

**కురవి, సెప్టెంబర్ 28 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రొద్దుటూరి వెంకన్న గుప్త జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనానికి నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రొద్దుటూరి వెంకన్న గుప్త ఆరుగురు కుమారులు, వారి కుటుంబ సభ్యులు పి. ఆర్. జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా బోరుబావిని ఏర్పాటు చేస్తున్నారు. బోరుబావి పనులను గ్రామ సర్పంచ్ రెంటాల కృష్ణ, మాజీ జడ్పీటీసీ అంబటి వీరభద్రం గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వెంకన్న గుప్త కుటుంబ సభ్యులతో





కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బోరులో పుష్కలంగా నీరు పడటంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెంటాల కృష్ణ మాట్లాడుతూ వైకుంఠధామాల నిర్వహణకు, అంత్యక్రియలకు వచ్చే ప్రజల స్నానాలు, ఇతర అవసరాలకు నీటి వసతి అత్యంత కీలకమన్నారు. వెంకన్న గుప్త జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉచితంగా బోరుబావి వేయించి, మోటారు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. మాజీ జడ్పీటీసీ అంబటి వీరభద్రం గౌడ్ మాట్లాడుతూ "కన్ను తెరిస్తే జననం... కన్ను మూస్తే మరణం. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి జీవితంలో అంతిమ సంస్కారాలకు ప్రాధాన్యత ఉంది" అన్నారు. బాధతో నిర్వహించే పవిత్రమైన అంత్యక్రియలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో బోరుబావి ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వెంకన్న గుప్త ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వైకుంఠధామాలు ధనిక, పేద, ఎక్కువ, తక్కువ అనే తేడా లేకుండా ప్రతి భౌతికకాయానికి సగౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణమూర్తి, గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు ఎడ్ల ఉప్పలయ్య, అంబటి మల్లికార్జున్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆవుల కందయ్య, ప్రొద్దుటూరి వెంకన్న గుప్త కుమారులు ప్రొద్దుటూరి వాసుదేవు గుప్త, హరేందర్ గుప్త, సత్యనారాయణ గుప్త, గ్రామ పెద్దలు షేక్ ముస్తఫా, అంబటి కరుణాకర్, బండి దీపక్ గౌడ్, శీలం కరుణాకర్, పల్లా వాసురెడ్డి, బండి ఉప్పలయ్య గౌడ్, బండి మల్లయ్య గౌడ్, పల్లా సత్తిరెడ్డి, తోట యాదయ్య, అక్కెనపల్లి మల్లయ్య, ఓరుగంటి సైదులు, ఎస్.డి. ఖాజా, మల్లన్న స్వామి ఆలయ పూజారి లింగస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వదంతులను నమ్మొద్దు.. విద్యార్థులను ఎలుకలు కరచిన ఆనవాళ్లు లేవు

- గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ.. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా.
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.

**పాలకుర్తి, సెప్టెంబరు 28 (జనం వాయిస్):**

పాలకుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు వచ్చిన సమాచారంపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించారు. సోమవారం ఆర్డీఓ కిరణ్ ప్రకాష్‌తో కలిసి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై క్షుణ్ణంగా ఆరా తీశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.. భోజనం ఎలా ఉంది? ఆరోగ్యం ఎలా ఉంది? జ్వరం వస్తుందా? ఎలుకలు కరిచినట్లు చూశారా? ఎప్పుడు జరిగింది? రక్తం వచ్చిందా? నొప్పి ఉందా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.





విద్యార్థుల చేతులు, కాళ్లను కూడా పరిశీలించారు. తమకు జ్వరం లేదని, రక్తం రాలేదని, భోజనం బాగానే ఉంటోందని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వదంతులను నమ్మవద్దని, విద్యార్థులను పరిశీలించగా ఎలుకలు కరిచిన ఆనవాళ్లు, గీతలు కనిపించలేదని స్పష్టం చేశారు.

**పరిశుభ్రతపై అసంతృప్తి.**

కలెక్టర్ పాఠశాలలోని వంటశాల, భోజన గది, సరుకుల నిల్వ గది, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యార్థుల వసతి గదులను పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసి, పనికిరాని వస్తువులను వెంటనే తొలగించి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన పౌష్టికాహారం అందించాలని, తాజా కూరగాయలతో ఆహారం తయారు చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలలోకి అనుమతి లేకుండా బయటి వ్యక్తులను అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఎంపీడీఓ, తహసీల్దార్‌లు గురుకుల పాఠశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ వేదవతి, వైస్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వల్మిడి బ్రిడ్జి పనులకు వేగం పెంచాలి

## వర్షాలు వస్తే రాకపోకలు బంద్ అయ్యే ప్రమాదం

**సెప్టెంబర్ 27జనం వాయిస్ పాలకుర్తి**

పాలకుర్తి--కొడకండ్ల ప్రధాన రహదారిపై వల్మిడి వద్ద చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థానికులు బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే రహదారి పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు వర్షాకాలం మరిన్ని కష్టాలు తెచ్చే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురిసి చెరువులు, వాగులు పొంగిపొర్లితే ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఈ మార్గం మూసుకుపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి పనుల్లో వేగం పెంచడంతో పాటు, వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

- ప్రత్యామ్నాయ మంచినీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి : ఎంపీడీఓ వీరబాబు.

**కురవి, సెప్టెంబరు 28 (జనం వాయిస్):**

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కారణంగా కురవి మండలంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు తాత్కాలికంగా నిలిచిపోనున్నట్లు ఎంపీడీఓ వీరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యామ్నాయ మంచినీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే నీటి సరఫరా నిలిపివేత విషయాన్ని కార్యదర్శులు, సర్పంచ్ లు టామ్‌టామ్ ద్వారా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. రెండు రోజులపాటు ప్రజలు ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లను వినియోగించుకుని అధికారులకు సహకరించాలని ఎంపీడీఓ వీరబాబు కోరారు.




# రైతు సమస్యలపై ఐక్య పోరాటమే మార్గం.

## బలరామ జయంతి వేడుకల్లో కిసాన్ సంఘ్ పిలుపు

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 28:**





రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు లెక్కల జలంధర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లెక్కల ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మైలారం గ్రామంలో మాజీ సర్పంచ్ చల్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బలరామ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి బలరాముడికి నివాళులర్పించారు.

విద్యుత్, ఎరువులు, కౌలు రైతుల సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలతో పలు సమస్యలను పరిష్కరించగలిగామని నాయకులు తెలిపారు. రైతుల హక్కుల పరిరక్షణకు భవిష్యత్తులోనూ ఐక్యంగా ఉద్యమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం మైలారం గ్రామ కిసాన్ సంఘ్ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.

◆ **కమిటీ వివరాలు**

అధ్యక్షుడిగా చల్ల భగవాన్‌రెడ్డి, కార్యదర్శిగా దూదిపాల జాగిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బత్తిన రమేశ్, కన్నెబోయిన రమేశ్, దూదిపాల తిరుపతిరెడ్డి, చల్ల ఎల్లారెడ్డి, బంటేరు రంకర్, హరిజల సాంబరెడ్డి, సాంబరెడ్డిలను ఎంపిక చేశారు.

◆ **ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం**

దేశ రక్షణలో ఆర్మీ జవాన్‌గా సేవలందించి పదవీ విరమణ అనంతరం స్వగ్రామంలో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్న దూదిపాల తిరుపతిరెడ్డిని కిసాన్ సంఘ్ నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ నూనె దివ్య--తిరుపతిలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి, గిద్దెమారి సురేష్, దూదిపాల కొమరారెడ్డి, పంచగిరి నర్సయ్య, మాజీ వార్డు సభ్యులు రాజిరెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేని ఎరువుల విక్రయాలపై కొరడా

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- ఏఓ మార్క ప్రియదర్శని

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 28:**

లైసెన్స్‌లో నమోదైన ఎరువులనే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని సూచించారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు--అమ్మకపు బిల్లులు, గ్రౌండ్ స్టాక్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. లైసెన్స్‌లో నమోదు కాని ఎరువులను గుర్తించి, వాటి విక్రయాలను నిలిపివేస్తూ సంబంధిత డీలర్లకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మార్క ప్రియదర్శిని హెచ్చరించారు.



# అసైన్డ్ భూములపై కమిటీ ఏర్పాటుపై హర్షం.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 28:**

అసైన్డ్ భూముల సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసినందుకు తెలంగాణ భూరక్షణ సమితి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం మహేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పత్తిపాక గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం చంటి, చింతం శ్రీకాంత్, గజ్జి శ్యామ్, గజ్జి శ్రీనివాస్, దుప్పటి ప్రవీణ్, సంతు, అశోక్, శ్రీను పాల్గొన్నారు.



# విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**మహబూబాబాద్, సెప్టెంబర్ 28 (జనం వాయిస్):**

రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్ఠంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.., రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకోవడం పై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు. జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ఏదైనా ప్రతికూల నివేదిక వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను ప్రస్తుతం డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నవీకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాల్ ఫ్రెండ్స్ తర్వాత సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ తదితర అన్ని విభాగాలకు సంబంధించి జిల్లాలో ఉన్న (123) వసతి గృహాల నిర్వహణలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని, ఫిర్యాదుల బాక్సులను మెయింటైన్ చేయాలని, ప్రత్యేక అధికారులు ప్రతినిత్యం గమనిస్తూ బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ సమయాలలో వసతి గృహాలను సందర్శించాలని ఆదేశించారు, పిల్లలకు మానసిక స్థితిగతులను గమనిస్తూ ఉండాలని అవసరమున్న చోట వైద్యుల చేత కౌన్సిలింగ్ నిర్వహించాలని అన్నారు, వసతి గృహాల లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేరుగా తనకు ఫోన్ లేదా మెసేజ్ చేయాలని కలెక్టర్ వసతి గృహాల ఆర్ సి ఓ లు డి సి ఓ లకు సూచించారు. సంక్షేమ హాస్టల్ లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి బుష్ క్లియరెన్స్ చేయాలనీ... అన్నీ హాస్టల్ లో ఎలాంటి పిచ్చి మొక్కలు, చెత్త చేదారం లేకుండా చేయాలన్నారు. అన్నీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొని హాస్టల్ లను క్లీన్ అండ్ గ్రీన్ గా తీర్చిదిద్దా లన్నారు , అలాగే ప్రతీ హాస్టల్ ని సందర్శించి ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాల ప్రస్తుత పరిస్థితి అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుంద లేదా అని కూడా పరిశీలించి నివేదిక లను సమర్పించాలన్నారు, ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, మైనార్టీ అధికారిని, డిఆర్‌ఓ నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఇంచార్జి డిఈఓ శ్రీరాములు, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాస రావు, అన్ని విభాగాల ఆర్సిఓలు, డిసిఓలు, తదితరులు పాల్గొన్నారు.




# సచిన్‌తో పోలిక నాకొద్దు.. ఆయన ఒక లెజెండ్: కోహ్లీ

- వెస్టిండీస్‌పై సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లీ
- క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రెండు రికార్డులు బద్దలు
- వన్డేల్లో అత్యంత వేగంగా 15వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా కోహ్లీ ఘనత
- భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొత్త చరిత్ర
- సచిన్‌తో పోలికపై స్పందన.. అతడి స్థానం ఎప్పటికీ ప్రత్యేకం అన్న విరాట్.

టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన పరుగుల దాహాన్ని కొనసాగిస్తున్నాడు. వెస్టిండీస్‌తో నిన్న తిరువనంతపురంలో జరిగిన మొదటి వన్డేలో అద్భుత శతకంతో చెలరేగిన కోహ్లీ, భారత జట్టుకు ఘన విజయాన్ని అందించడమే కాకుండా.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రెండు ప్రధాన రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ కేవలం 88 బంతుల్లోనే 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో భాగంగా కోహ్లీ వన్డే క్రికెట్‌లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు సచిన్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. అయితే, కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును చేరగా, సచిన్‌కు దీనికోసం 377 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. అంటే.. సచిన్ కంటే 74 ఇన్నింగ్స్‌లు తక్కువ ఆడి ఈ రికార్డును కోహ్లీ సొంతం చేసుకోవడం విశేషం. ఇదే మ్యాచ్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును కూడా అధిగమించాడు. భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ (6,976) పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌తో కోహ్లీ స్వదేశంలో 7,006 పరుగులు పూర్తి చేసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇది కోహ్లీకి వన్డేల్లో 55వ సెంచరీ కాగా, లిస్ట్-ఏ క్రికెట్‌లో 60వ శతకం. ఈ క్రమంలో లిస్ట్-ఏ సెంచరీల విషయంలోనూ సచిన్ రికార్డును సమం చేశాడు. మ్యాచ్ అనంతరం తన రికార్డులు, సచిన్‌తో పోలికలపై కోహ్లీ వినమ్రంగా స్పందించాడు. "నాకు సచిన్ పాజీ ఎప్పటికీ సచిన్ పాజీనే. అతను తన కాలంలో ఆటలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. అది సంఖ్యలు, పోలికలకు అతీతమైన విషయం. ప్రజలపై అతను చూపిన ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించాడు.



# వెస్టిండీస్ ఓపెనర్ గ్రీవ్స్ సెంచరీ.. టీమిండియా ముందు భారీ టార్గెట్

వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా ముందు భారీ లక్ష్యం నిలిచింది. తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్, నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగుల స్కోరు సాధించింది. ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (101) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (4/40) నాలుగు వికెట్లతో విండీస్ ను కట్టడి చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం సరైంది కాదేమో అన్నట్లుగా విండీస్ ఓపెనర్లు జాన్ క్యాంప్‌బెల్ (62), జస్టిన్ గ్రీవ్స్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 135 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో క్యాంప్‌బెల్ దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని కుల్దీప్ యాదవ్ విడదీశాడు. క్యాంప్‌బెల్‌ను ఔట్ చేసి భారత్‌కు తొలి వికెట్ అందించాడు. ఆ తర్వాత తన స్పిన్ మాయాజాలంతో విండీస్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. కెప్టెన్ షాయ్ హోప్ (12), సెంచరీ హీరో జస్టిన్ గ్రీవ్స్, జ్యువెల్ ఆండ్రూ (0)లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ పంపాడు. దీంతో, 176/2 స్కోరుతో పటిష్ఠంగా ఉన్న విండీస్.. కుల్దీప్ విజృంభణతో 198/5కి చేరింది. ఒక దశలో విండీస్ 250 పరుగులు కూడా చేయలేదనిపించినా.. చివర్లో అమీర్ జంగూ (58 నాటౌట్) అద్భుతంగా ఆడాడు. కేవలం 43 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయ హాఫ్ సెంచరీ సాధించి జట్టు స్కోరును 295 పరుగులకు చేర్చాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లు తీయగా, ప్రసిద్ధ్ కృష్ణ 2, నితీశ్ రెడ్డి ఒక వికెట్ పడగొట్టారు.



# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'.. 'నారాయణమ్మ' పాట వచ్చేసింది!

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నెం. 47) నుంచి సంగీత సందడి మొదలైంది. ఈ చిత్రం నుంచి 'నారాయణమ్మ' అనే తొలి పాటను చిత్రబృందం ఆదివారం విడుదల చేసింది. విడుదలైన కొద్దిసేపటికే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. తమన్ స్వరపరిచిన ఈ మాస్ ఫోక్ నంబర్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. గాయకులు రామ్ మిరియాల, ప్రభ తమ గాత్రంతో పాటకు ఊపు తెచ్చారు. ముఖ్యంగా రామ్ మిరియాల వాయిస్ పాటకు జానపద కళను అద్దింది. ఈ పాటలో వెంకటేశ్ తనదైన ఎనర్జిటిక్ స్టెప్పులతో అభిమానులను ఉత్సాహపరిచారు. హీరోయిన్లు శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్‌లతో పాటు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డింపుల్ హయాతి తన గ్లామర్, మాస్ డ్యాన్స్‌తో అదరగొట్టింది. ఈ పాట విడుదల ఈవెంట్ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ, త్రివిక్రమ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "గతంలో త్రివిక్రమ్ రచయితగా ఉన్నప్పుడు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి క్లాసిక్ ప్రేమకథలు చేశాం. ఆ సినిమాల్లో నేను పెళ్లికాని వాడిని. ఇప్పుడు పెళ్లైంది, వైబ్ వేరేగా ఉంది. ఇది మామూలు కుటుంబం కాదు. 'ఆదర్శ కుటుంబం' వేరే లెవెల్‌లో ఉంటుంది. సరదాతో పాటు ప్రేక్షకులు ఎంజాయ్ చేసే ట్విస్టులు కూడా ఉంటాయి" అని సినిమాపై ఆసక్తిని పెంచారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదట అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించినా, తాజాగా అక్టోబర్ 9న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ మాస్ పాటతో ప్రమోషన్లు ప్రారంభించిన చిత్రబృందం, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయింది.



# హీరో భార్యకు నచ్చలేదని నన్ను తీసేశారు: తాప్సీ

ప్రముఖ నటి తాప్సీ తన కెరీర్ ఆరంభంలో బాలీవుడ్‌లో ఎదుర్కొన్న కొన్ని అవమానకరమైన అనుభవాలను పంచుకున్నారు. హీరో భార్యకు తాను నచ్చలేదనే వింత కారణంతో తనను ఓ సినిమా నుంచి తనను తొలగించారని వెల్లడించారు. ఇటీవల నయన్‌దీప్ రక్షిత్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాప్సీ ఈ షాకింగ్ విషయాలను పంచుకున్నారు. తాప్సీ మాట్లాడుతూ, "ఓ సినిమాకు సంతకం చేసిన తర్వాత నన్ను తొలగించారు. కారణం ఏంటని అడిగితే, 'హీరో భార్యకు మీరు నచ్చలేదు' అని చెప్పారు. ఆ హీరో భార్యకు నేనెందుకు నచ్చలేదో ఇప్పటికీ నాకు తెలియదు" అని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ నటుడు, ఆయన భార్య ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. మరో సందర్భంలో, ఓ ప్రముఖ హీరో తన స్థానంలో అతడికి బాగా సన్నిహితురాలైన నటిని తీసుకోవడం కోసం తనను సినిమా నుంచి తప్పించారని తాప్సీ పేర్కొన్నారు. అదే సమయంలో, పరిశ్రమలో నటీనటులను ఒకేరకమైన పాత్రలకు పరిమితం చేసే (టైప్‌కాస్ట్) ధోరణిపై కూడా తాప్సీ స్పందించారు. కొందరిని గ్లామర్ పాత్రలకు, మరికొందరిని సీరియస్ పాత్రలకు పరిమితం చేస్తారని, తన విషయంలో అలా జరగకుండా ఉండేందుకే కొన్ని ఆఫర్లను స్పష్టంగా తిరస్కరిస్తున్నానని ఆమె తెలిపారు. కాగా, తాప్సీ ఇటీవల 'అస్సి', 'గాంధారి' వంటి చిత్రాల్లో తన నటనతో ప్రశంసలు అందుకున్నారు.





# పెదవులకు సర్జరీపై వెనక్కి తగ్గా.. సాయి పల్లవిని చూసి నేర్చుకున్నా: నివేదా పేతురాజ్

'మెంటల్ మది' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా పేతురాజ్, తన కెరీర్‌కు సంబంధించి కొన్ని సంచలన విషయాలను బయటపెట్టారు. ఒకానొక దశలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై, నటనకు పూర్తిగా గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఒకవేళ మళ్లీ అవకాశాలు రాకపోతే హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుంటూ గడపాలని కూడా భావించినట్లు ఆమె చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆమె త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. నివేదా తాజాగా తన గతాన్ని గుర్తుచేసుకుంటూ, 2023లో కొన్ని తప్పుడు నిర్ణయాలు, వ్యక్తిగత కారణాల వల్ల తీవ్రమైన డిప్రెషన్‌తో పాటు పానిక్ అటాక్స్‌ను ఎదుర్కొన్నానని వెల్లడించారు. ఆ పరిస్థితుల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని, ఆ సమయంలోనే సినిమాలకు దూరమవ్వాలనే ఆలోచన వచ్చిందని చెప్పారు. అదృష్టవశాత్తూ పరిస్థితులు అనుకూలించి మళ్లీ అవకాశాలు రావడంతో నటనపై దృష్టి సారించినట్లు వివరించారు. అంతేగాక కెరీర్ ఆరంభంలో తన రూపంపై అసంతృప్తితో పెదవులకు సర్జరీ చేయించుకోవాలని కూడా ఆలోచించినట్లు నివేదా తెలిపారు. ఈ విషయం గురించి తన వైద్యుడిని సంప్రదించగా, ఆయన తీవ్రంగా మందలించారని, భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యల గురించి హెచ్చరించడంతో ఆ ఆలోచనను విరమించుకున్నానని అన్నారు. "సహజ సౌందర్యంతోనే సాయి పల్లవి, నిత్యామీనన్ వంటి నటీమణులు ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. వారిని చూశాక, నా రూపం గురించి నేను అనవసరంగా ఎందుకు ఆందోళన చెందుతున్నానో అర్థమైంది" అని నివేదా పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకో విచిత్రమైన అనుభవం ఉందని, తాను ప్రతికూలంగా ఏదైనా ఊహించుకుంటే అది నిజమవుతుందని నివేదా పంచుకున్నారు. తన మాజీ ప్రియుడి విషయంలోనూ ఇలాంటిదే జరిగిందని, ఆ తర్వాత నుంచి ఎక్కువగా ఆలోచించడం మానేశానని ఆమె తెలిపారు. కష్టకాలం నుంచి బయటపడి ఇప్పుడు మళ్లీ సినిమాలతో బిజీ అవ్వడం సంతోషంగా ఉందని నివేదా అన్నారు.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com